

బస్సుల కొరత... విద్యార్థుల కలత

- నర్సీపట్నంలోని విద్యాలయాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు
- ఉదయం వేళ రెండే బస్సులు ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం
- ఇంటి నుంచి వెళ్లింది మొదలు.. తిరిగి చేరేవరకు తల్లిదండ్రుల్లో ఆందోళన

- 5లో

వైసీపీ పాలనలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

వైఎస్సార్ పాలనలో వ్యవసాయం పండగ, జగనన్న ప్రభుత్వంలో దండగ

- ములగపూడి రచ్చబండలో వైఎస్ షర్మిల ధ్వజం
- ప్రజల కష్టాలు తెలుసుకున్న పీసీసీ అధ్యక్షురాలు



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న షర్మిల

నర్సీపట్నం, ఫిబ్రవరి 10:

వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. నర్సీపట్నం నియోజకవర్గంలో తాండవ గేట్లు మరమ్మతులు చేయించలేదని విమర్శించారు. శనివారం నాతవరం మండలం ములగపూడిలో ఆమె రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రచ్చబండ వద్ద పార్టీ జెండాను ఎగురవేసి అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతుల కోసం విత్తనాలు, ఎరువులు రాయితీ మీద ఇచ్చేవారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో రైతులు అప్పులపాలు అవుతున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. వైఎస్ఆర్ పాలనలో వ్యవసాయం అంటే పండగ, జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం అంటే దండగ అన్నట్టుగా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, పంట నష్టపోయినా పరిహారం లేదని విమర్శించారు. వైఎస్సార్ పాలనలో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల ఎంతోమంది ఇంజనీర్లు, డాక్టర్లుగా కాగలిగారని, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిపోయి యువత వలస పోతున్నారన్నారు. జగనన్న అంటే తనకు ద్వేషం లేదని, సిద్ధాంత పరమైన వ్యత్యాసం తప్ప ఇద్దరిదీ ఒకే రక్తమన్నారు. బీజేపీపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రత్యేక హోదా సాధించడంలో టీడీపీ, వైసీపీలు విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయితే తొలి సంతకం ప్రత్యేక హోదా ఫైల్‌పై పెడతానని మాటిచ్చారని తెలిపారు.

ప్రజల కష్టాలు తెలుసుకుని..

రచ్చబండ కార్యక్రమంలో ప్రజల సమస్యలను షర్మిల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన లోవరాజు మాట్లాడుతూ తాను కాంగ్రెస్ కార్యకర్తనని, రాజశేఖర్‌రెడ్డి వెనుక కాంగ్రెస్ జెండాలు పట్టుకొని తిరిగానన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత వైసీపీలో చేరానని, మీరు పాదయాత్ర చేసినప్పుడు వైసీపీ జెండాలు పట్టుకుని తిరిగానని షర్మిలను ఉద్దేశించి అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. మర్రిపాలేనికి చెందిన శెట్టి గౌరీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తప్పుడు రికార్డులు సృష్టించి రూ.4 కోట్లు విలువైన భూమిని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ములగపూడి గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు సాంబయ్య మాట్లాడుతూ తనకు నలుగురు పిల్లలు ఉన్నారని, ఏ ఒక్కరికి ఇళ్ల స్థలం ఇవ్వలేదని చెప్పారు. మాజీ ఎంపీటీసీ రావు దేవుళ్లు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నేవల్‌బేస్ కోసం భూములు తీసుకున్నారని తెలిపారు. 108 రోజులుగా ధర్నా చేస్తున్నా అధికార, ప్రతిపక్ష నాయకులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, జేడీ శీలం, గిడుగు రుద్రరాజు, రుత్తల శ్రీరామమూర్తి, మీసాల సుబ్బన్న, బొడ్డు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

జిల్లాలో 46 కేంద్రాల ఏర్పాటు

- హాజరుకానున్న 8,001 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- సెలవు రోజు ప్రారంభంపై విద్యార్థుల అసహనం

అనకాపల్లి, ఫిబ్రవరి 10:

జిల్లాలో ఆదివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు 46 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన 8,001 విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. .

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించనున్న 46 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఇంటర్మీడియట్ జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. కాగా ఆదివారం సెలవు రోజున పరీక్షలు ప్రారంభిస్తుండడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్

టికెట్‌పై స్పష్టత కరవు



విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ అధిష్ఠానం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం రీజనల్ కో-ఆర్డినేటర్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. ఆయనకు సహాయకుడిగా అమర్‌నాథ్‌ను నియమించారు. అమర్‌నాథ్ ప్రస్తుతం అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ ఆయన్ను తప్పించి మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తగా పార్టీ నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలో మంత్రికి ఇంతవరకూ స్పష్టత ... మిగతా 6వ పేజీలో

సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు



రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే..

ఓట్లు అడిగేందుకు వచ్చే వైసీపీ నాయకులను నిలదీయండి

- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

అనకాపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో రాబోయేది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు అన్నారు. అనకాపల్లి నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే వైసీపీ నాయకులను ఏం అభివృద్ధి చేశారని కాలర్ పట్టుకొని నిలదీయాలని పిలుపునిచ్చారు. అనకాపల్లిలో ప్రధానంగా దోమల బెడదతో పాటు ప్రజలకు వైసీపీ అరాచక పాలనతో బాధలు తప్పడం లేదన్నారు. ప్రజలను వేధిస్తున్న వైసీపీ నాయకులను రానున్న ఎన్నికల్లో ఓటుతో ఇంటికి పంపాలన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా అరకు గుర్తుకు వస్తుందని, దీనికి కారణంగా వైసీపీ పాలకులేనని విమర్శించారు. గంజాయి అక్రమ రవాణాలో ఆయనకు భాగస్వామ్యం ఉందని విన్నానని పరోక్షంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జనసేన నాయకులు, వీర మహిళల జోలికొస్తే సహించేది లేదన్నారు. విస్సన్నపేటలో మంత్రి ప్రమేయంతో 600 ఎకరాలు కబ్జాకు గురయ్యాయన్నారు. జనసేన, టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరినీ వదిలేది లేదన్నారు. అందరినీ చెవులు మెలేసి మరీ జైలుకు పంపుతామని వ్యాఖ్యానించారు.

సహజ వనరుల దోపిడీ

రాష్ట్రంలో సహజ వనరులను వైసీపీ నాయకులు దోచుకుతింటున్నారని ఆరోపించారు. దేశంలో దురదృష్టవశాత్తూ రీకాల్ విధానం అమలులో లేదని, తప్పనిసరి పరిస్థితిలో ఐదేళ్లపాటు అరాచక పాలన అనుభవించాల్సి వస్తున్నదన్నారు. రాష్ట్రంలో 35 వేల మంది మహిళలు మాయమైతే, వారిలో ఇంకా అనేక మంది ఆచూకీ లభించలేదని, దీనిపై సీఎం జగన్ కనీసం సమీక్ష నిర్వహించలేదన్నారు. అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్‌ను పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. అనాదిగా అనకాపల్లి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి బెల్లం పంపుతుంటే వైసీపీ దీన్ని నిలిపేసిందన్నారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని మూసేసి రైతులను, ఉద్యోగులను రోడ్డున పడేశారని తెలిపారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చాక యువతీ యువకుల కోసం ప్రతి నియోజకవర్గంలో 500 ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత జనసేన తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర పర్యవేక్షకుడు బొలిశెట్టి సత్య, జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్, జనసేన సీనియర్ నాయకులు సుందరపు సతీష్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాశీపురంలో దారుణం

మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వివాహిత

- తన భర్తతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఘాతుకం
- కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు
- పోలీసుల అదుపులో నిందితురాలు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 10 :



కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లంగి లక్ష్మి

తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో భార్య. ఓ మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ప్రస్తుతం ఆమె కాలిన గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో సంచలనం సృష్టించిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలివి. తాటిపర్తి పంచాయతీ కాశీపురం గ్రామంలో అల్లంగి లక్ష్మి అనే మహిళ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈమె భర్త చిలుకునాయుడు ఏడాది కిందట చనిపోయాడు. ఈమెకు ఇద్దరు సంతానం. ఈమెకు అల్లంగి పోతురాజు, అతని భార్య చిన్నమ్మలు అలియాస్ చిన్నారి సమీప బంధువులు. వీరంతా ఇదే గ్రామంలో నివాసం ఉంటున్నారు. అయితే పోతురాజుకు అల్లంగి లక్ష్మికి మధ్య వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో చిన్నమ్మలు కోపోద్రిక్తురాలై శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో లక్ష్మి ఇంటికి వెళ్లింది. ఆమె ముఖంపై, శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీంతో ఆమె ముఖం, కడుపు శరీర భాగాలపై గాయాలయ్యాయి. మంటలు అంటుకోవడంతో లక్ష్మి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆర్పారు. వెంటనే ఆటోలో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం లక్ష్మి చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చిన్నమ్మలును అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.



విశాఖ విమానాశ్రయంలో అభివాదం చేస్తున్న నారా లోకేశ్

లోకేశ్‌కు ఘన స్వాగతం

రోడ్డు మార్గాన ఇచ్ఛాపురానికి...

- నేడు 'శంఖారావం' ప్రారంభం
- 17 నుంచి విశాఖ జిల్లాలో పర్యటన

విశాఖపట్నం, ఫిబ్రవరి 10:

ఉత్తరాంధ్రలో 'శంఖారావం' కార్యక్రమం ప్రారంభించేందుకు శనివారం విశాఖకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం ఆరున్నర గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. లోకేశ్‌కు ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, గండి బాబ్జీ, వంగలపూడి అనిత, నేతలు కోరాడ రాజబాబు, మహ్మద్ నజీర్, పాశర్ల ప్రసాద్, రెడ్డి నారాయణరావు, పుచ్చా విజయకుమార్, పీఎస్ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో చేపట్టనున్న శంఖారావం యాత్రపై నాయకులతో లోకేశ్ ముచ్చటించారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం బయలుదేరి వెళ్లారు. ఆదివారం 'శంఖారావం' ప్రారంభించనున్నారు.

విశాఖ జిల్లాలో 17 నుంచి పర్యటన

శంఖారావం యాత్రలో భాగంగా నారా లోకేశ్ ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 17వ తేదీ సాయంత్రం భీమిలి నియోజకవర్గంలో సభ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. 18వ తేదీ ఉదయం విశాఖ తూర్పు, మధ్యాహ్నం దక్షిణ, రాత్రికి ఉత్తర నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, బహిరంగ సభలు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి. 19వ తేదీన విశాఖ పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల్లో పర్యటించిన అనంతరం అనకాపల్లి జిల్లాకు వెళతారు.

హనుమాన్ విజయంలో మనోళ్లు

సినిమా వీఎఫ్ఎక్స్‌లో సత్తాచాటిన పండమనేటి ఉదయ్‌కృష్ణ


- చోడవరంతో అనుబంధం
- విద్యాభ్యాసం చోడవరం, విశాఖలోనే..
- అల్లూరి, అనకాపల్లి జిల్లాల అందాలను కెమెరాలో బంధించిన మూర్తి చోడవరం వాసి



హనుమాన్ సినిమాలో ఉదయ్‌కృష్ణ రూపొందించిన విజువల్ వండర్స్

చోడవరం, ఫిబ్రవరి 10:

ఈ ఏడాది సంక్రాంతి పండుగకు విడుదలైన హనుమాన్ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. చిన్న సినిమాగా విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ప్రభంజనం సృష్టించి ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఈ విజయంలో వీఎఫ్ఎక్స్ కీలక భూమిక పోషించింది. దీనికి ప్రధాన పాత్ర పోషించిన వీఎఫ్ఎక్స్ సృష్టికర్త పండమనేటి ఉదయ్‌కృష్ణకు చోడవరంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఈ సినిమాకు పనిచేసిన స్థానిక ఫొటోగ్రాఫర్ కేవీఎస్ఎన్ మూర్తి కూడా స్థానికుడు కావడం విశేషం.



హనుమాన్ సినిమా వీఎఫ్ఎక్స్ సృష్టికర్త ఉదయ్‌కృష్ణ బాల్యమంతా చోడవరం, ఉమ్మడి విశాఖ జిల్లాలోనే సాగింది. ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ తండ్రి చోడవరం సబ్ ట్రెజరీ ఉద్యోగి కావడంతో చోడవరం, విశాఖలోనే విద్యాభ్యాసం కొనసాగింది. విశాఖలో కంప్యూటర్ గ్రాఫిక్స్ కోర్సు నేర్చుకోవడం ద్వారా వీఎఫ్ఎక్స్‌లో ప్రావీణ్యం సంపాదించారు. సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం చేస్తూ, హైదరాబాద్‌లో ... మిగతా 6వ పేజీలో

చోడవరంతో విడదీయరాని బంధం



ఇప్పటి వరకు హిందీ, తెలుగు సినిమాలకు వీఎఫ్ఎక్స్ పని చేసినా హనుమాన్ సినిమా ద్వారా వచ్చిన గుర్తింపు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. చిన్నతనం నుంచి చోడవరంలోనే పెరిగాను. నా స్నేహితులంతా ఇక్కడివారే. చోడవరంతో నా అనుబంధం మరిచిపోలేనిది. తక్కువ ఖర్చులో హనుమాన్ సినిమాకు వీ ఎఫ్ఎక్స్ వర్క్ చేశాను. సినిమా టీజర్‌తోనే హనుమాన్ సినిమా ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్ అందించడం నా పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను.

- పండమనేటి ఉదయ్‌కృష్ణ, వీఎఫ్ఎక్స్ సృష్టికర్త

ఓ పట్టాన రిజిస్ట్రేషన్ కావట్లే!

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సాంకేతిక సమస్యలు

- తరచూ సర్వర్ మొరాయింపు
- ఈ నెల 19తో ముగియనున్న గడువు
- ఇప్పటికి 20 శాతం కూడా పూర్తికాని ప్రక్రియ
- గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారుల పడిగాపులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)



అనకాపల్లి మండలం ఊడేరు సచివాలయంలో మొరాయిస్తున్న రిజిస్ట్రేషన్ల వెబ్‌సైట్

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్ల వెబ్‌సైట్ సర్వర్ తరచూ మొరాయిస్తుండడంతో గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో లబ్ధిదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ఈ నెల 19వ తేదీతో గడువు ముగుస్తున్నా ఇప్పటి వరకు 20 శాతం రిజిస్ట్రేషన్లు కూడా కాలేదని తెలిసింది.

జిల్లాలో జగనన్న కాలనీల లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం గతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా రిజిస్ట్రేషన్లు చేయలేదు. ఆయా పట్టాలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించి రిజిస్ట్రేషన్లు చేయడానికి అవకాశం ఇచ్చింది. ఈ నెల 19వ తేదీలోగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సర్వర్ ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

సరుగుడు యంత్రంలో చిక్కుకుని మహిళా కూలీ మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ

పరవాడ, ఫిబ్రవరి 10: సరుగుడు కలప నుంచి తొక్కను వేరు చేసే యంత్రంలో చిక్కుకుని మహిళా కూలీ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక సినిమాహాల్ జంక్షన్ సమీపంలోని సరుగుడు కర్రల యార్డులో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో గల కర్రల యార్డులో సరుగుడు కలప నుంచి తొక్కను యంత్రం ద్వారా వేరు చేస్తారు. ఈ యంత్రం వద్ద కొన్ని రోజులుగా కట్టవానిపాలెం, చిట్టిబోయినపాలెం, వెన్నెలపాలెం గ్రామాలకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ (55) యంత్రంలో సరుగుడు కర్రలు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ చీర కొంగు యంత్రంలో చిక్కుకుంది. ఆ సమయంలో యంత్రాన్ని ఆపు చేసే అవకాశం లేకపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఆమెతోపాటు మరో నలుగురు మహిళలు పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న పరవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కాగా సూర్యనారాయణమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శ్రీను (ఫైల్)

నక్కపల్లి, ఫిబ్రవరి 10: మండలంలో మనబాలవానిపాలెం హైవే జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందినట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు. ఈ గ్రామానికి ఎం.శ్రీను (42) రోడ్డుపై నడిచి వెళుతుండగా నక్కపల్లి వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 10: మండలంలోని పులపర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. విశాఖపట్నం నుంచి భీమవరం వెళుతున్న బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో బస్సు ముందున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదన్నారు.

అలల ఉధృతికి దెబ్బతిన్న ఎనిమిది బోట్లు

నక్కపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని డీఎల్‌పురం సముద్రతీరంలో అలల ఉధృతికి మత్స్యకారుల బోట్లు, వలలు దెబ్బతిన్నాయి. శనివారం తెల్లవారుజామున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా ఒక్కసారిగా అలలు ఉధృతంగా రావడంతో 8బోట్లు దెబ్బతిన్నాయని మత్స్యకారులు చెప్పారు. వాసుపల్లి నాగరాజు, గరికిన బాబ్జి, దోనీ సత్తిబాబు, వాసుపల్లి పెదవెంకులు, యజ్జల అన్నవరం, మసేను, దోని అప్పారావులకు చెందిన బోట్లు వలలు దెబ్బతిన్నాయి. సుమారు రూ.2.5లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు మత్స్యకారులు తెలిపారు.

సెల్‌ఫోన్ల దొంగలకు రిమాండ్

కశింకోట, ఫిబ్రవరి 10: సెల్‌ఫోను దొంగిలించిన కేసులో ముగ్గురికి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వినోద్‌బాబు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి విశాఖపట్నం పాత పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన నక్కబోయిన శివశంకర్, నక్కబోయిన రాజేష్, చేపల ఉదయ్‌శంకర్ నర్సీపట్నం బొడ్డుపల్లికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న కన్నూరుపాలెంలో ఆగి వర్రి చిన అప్పలనాయుడు ఇం ట్లోకి చొరబడి రెండు సెల్‌ఫోనులు దొంగతనం చేశారన్నారు. ఇంట్లో చప్పుడు కావడంతో లేచి చూసేసరికి రెండు సెల్‌ఫోనులు పట్టుకొని పారిపోతున్నారని, వెంటనే కేకలు వేయడంతో అక్కడి నుంచి ఆటోలో తాళ్లపాలెం వైపు పరారయ్యారని తెలిపారు. వెంటనే 100 నంబరుకు కాల్ చేయగా తాళ్లపాలెం జంక్షన్ వద్ద నిందితులు ప్రయాణిస్తున్న ఆటోను ఆపి అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని చెప్పారు. కోర్టు ముందు హాజరుపరచగా వీరికి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

గాజువాక వైసీపీ సమన్వయకర్తకు నలుగురు సెక్యూరిటీ

- ఇష్టానుసారంగా అధికార దుర్వినియోగం
- మేయర్‌కు లేని సెక్యూరిటీ...కార్పొరేటర్‌కి ఎందుకో..?



సెక్యూరిటీ నడుమ గాజువాక వైసీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వింత పోకడలు ఎక్కువయ్యాయి. అధికార దుర్వినియోగం అధికమైంది. మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) మేయర్ గొలగాని హరికుమారికి ఎటువంటి భద్రత ఏర్పాట్లు లేవు. కానీ ఓ వార్డు (70)కు కార్పొరేటర్‌గా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు(చందూ)కు ప్రభుత్వం తాజాగా నలుగురు (2+2) గన్‌మెన్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాలు రాగానే అవి అమలులోకి కూడా వచ్చేశాయి. చందూకు బెదిరింపులు లేవు. శత్రువులు లేరు. రక్షణ కావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరలేదు. కానీ ఇచ్చారు. ఆయన గాజువాక నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కావడమే దానికి ప్రధాన కారణం. వచ్చే ఎన్నికల్లో గాజువాక నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన బరిలో దిగుతారని, అందుకే రక్షణ కల్పించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ విచిత్రం ఏమిటంటే...ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి 1+1 సెక్యూరిటీ మాత్రమే ఉంది. గతంలో మంత్రిగా చేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కూడా 1+1 సెక్యూరిటీయే ఉంది. వీరందరికీ ఇద్దరిని మాత్రమే ఇచ్చి చందూకి నలుగురిని ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అధికార పార్టీ నాయకులే అంటున్నారు.

అభ్యర్థిత్వం ఖరారైనట్టేనా...

గాజువాక వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన చందూయే ఎమ్మెల్యే అభ్యర్థి అని ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబానికి ఈసారి టికెట్ ఇవ్వలేమని అధిష్ఠానం స్పష్టంచేసినా వారు ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. యాదవ సామాజిక వర్గమని చందూకి టికెట్ ఇచ్చినట్టయితే...ఆయన కంటే మేయర్ హరికుమారిని పోటీకి దింపాలని తిప్పల వర్గం ప్రతిపాదించింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం తాజాగా చందూకు సెక్యూరిటీని ఇవ్వడంతో ఆయనకే టికెట్ అనే విషయం పరోక్షంగా స్పష్టంచేసినట్టయింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

బస్సుల కొరత... విద్యార్థుల కలత

- నర్సీపట్నంలోని విద్యాలయాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు
- ఉదయం వేళ రెండే బస్సులు ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం
- ఇంటి నుంచి వెళ్లింది మొదలు.. తిరిగి చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళన
- వాహనాల సంఖ్య పెంచాలని అంతా వేడుకోలు



జోగంపేటలో ఆర్టీసీ బస్సులో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళుతున్న విద్యార్థులు

గొలుగొండ, ఫిబ్రవరి 10: బస్సుల కొరత విద్యార్థులకు తీరని సమస్యగా మారింది. ఈ ప్రాంతం నుంచి నర్సీపట్నంలో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు రోజూ వందలాది మంది విద్యార్థులు వెళ్లివస్తుంటారు. ఉదయం సమయంలో తరగతులకు వెళ్లేందుకు రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులు మాత్రమే ఉన్నాయని, అవి ఎటుకూ చాలడం లేదని వారంతా వాపోతున్నారు. గత్యంతరం లేక ఆ బస్సులు ఫుట్‌బోర్డులపై సైతం వేలాడి మరీ విద్యాలయాలకు వెళ్లివస్తున్నారు. ఇది చూసిన తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు ఇంటి నుంచి బయల్దేరింది మొదలు.. సాయంత్రం ఇంటికి చేరే వరకు ఎప్పుడు ఎలా ఉంటుందోననే ఆందోళన వారిని వేధిస్తోంది. బస్సుల సంఖ్య పెంచాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇదిలా వుంటే, ప్రైవేటు వాహనాలు సైతం ఇదే రద్దీతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. బస్సుల కొరత కారణంగా సకాలంలో కళాశాలలకు చేరలేకపోతున్నామని, దీని వల్ల విలువైన సమయం వృథా అవుతూ చదువులో వెనుకబడిపోతున్నామని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ రూటులో బస్సుల సంఖ్య పెంచాల్సిందిగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

12న రోడ్డు పునర్నిర్మాణానికి అచ్యుతాపురంలో మానవహారం



అచ్యుతాపురంలో ప్రచారం చేస్తున్న రామ సదాశివరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డుని పునర్నిర్మించాలని కోరుతూ ఈనెల 12న భారీ మానవహారంతో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు తెలిపారు. శనివారం వీరు అచ్యుతాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రాణాంతకంగా మారిందని, ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి వాహన చోదకులు క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి అప్పారావు, ఎస్.కన్నూంనాయుడు, బుద్ద రంగారావు, కె.వెంకట రమేష్, కె.సోమునాయుడు, డి.శ్రీను, పి.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పీఈటీకి పతకం



స్వర్ణ పతకం సాధించిన ప్రతాప్

చోడవరం, ఫిబ్రవరి 9 : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరం పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఆండ్ర ప్రతాప్ బంగారు పతకాన్ని సాధించారు. శుక్రవారం జరిగిన 50 ఏళ్ల వయస్సు కేటగిరీలోని వంద మీటర్ల హార్డిల్స్‌లో ప్రతాప్ 19.22 సెకన్లలో గమ్యం చేరి ప్రథమ స్థానంలో నిలిచి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. పీఈటీ అయిన ప్రతాప్ వెటరన్ క్రీడల్లో సత్తాచాటడం విశేషం.

నేడు ఘంటసాల పాటల పోటీలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 10 : పట్టణంలో ఆదివారం ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్థంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీల నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల కళామందిర్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం సాయంత్రం కళాకారులచే సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు సంహాద్యక్షుడు ఆడారి పూరి జగన్నాథం తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించే పాటల పోటీల్లో పాల్గొనే వారంతా ఇ.సాంబశివరావు, 98684 03081, మత్తుర్తి రామారావు, 9866307171 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు. అంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవదాయ శాఖలో పదోన్నతులు, బదిలీలు

- ఉత్తరాంధ్రలో భారీ మార్పులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10: దేవదాయ శాఖలో సుదీర్ఘకాలం తరువాత పదోన్నతులపై బదిలీలు జరిగాయి. సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు సహాయ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయనగరం జిల్లా రామతీర్థాలు ఆలయం ఈవో బీహెచ్ఎస్ఎన్ కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న డీవీఎల్ రమేష్‌బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవస్థానానికి ఈఓగా నియమించారు. విశాఖలో ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.సుజాతకు సాంకేతిక కారణాల వల్ల పదోన్నతి కల్పించలేదు. కోనసీమ జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కేఎస్‌డీవీ ప్రసాద్‌కు డీసీగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా నియమించారు. అక్కడ ఈఓగా పనిచేస్తున్న డీవీవీ ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అన్నవరం దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు ఆలయ ఈఓగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అదే జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

అక్కడ ఏసీగా పనిచేస్తున్న హరిసూర్యప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. విశాఖ నగరంలోని ఇసుకకొండ సత్యనారాయణ దేవస్థానం ఈఓ బి.నగేష్‌బాబుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా మావుళ్ళమ్మవారి దేవస్థానం ఈఓగా నియమించారు. వన్‌టౌన్ పెద్ద శివాలయం ఈఓ నీలిమకు ఏసీగా పదోన్నతి కల్పించి విజయనగరంలోని పైడితల్లిమ్మ దేవస్థానం ఈఓగా నియమించినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఉత్తర్వులు నిలుపుదల చేశారు.

ఆవ అందాలను తిలకించిన నాగబాబు



ఆవలో బోటు షికారు చేస్తున్న నాగబాబు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 10 : కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని జనసేన రాష్ట్ర నాయకుడు కొణిదెల నాగేంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని కొండకర్ల ఆవలో బోటుపై ఆయన షికారు చేశారు. ఆవ అందాలను తిలకించారు. ఆవలో బోటు షికారు, విదేశీ పక్షుల రాకపోకలు, చేపల పెంపకం, చేపల వేటతో జీవనం సాగించే మత్స్యకారులు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులను ఆకర్షించేదుకు పలు కట్టడాలను కట్టాలని సూచించారు. ఆయన వెంట జనసేన నాయకులు సుందరపు విజయ్ కుమార్, సుందరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత సూర్యచంద్ర హౌస్ అరెస్టు



చెర్లోపాలెంలో గృహ నిర్బంధంలో ఉన్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 10 : నాతవరం మండలంలో గల తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం జనసేన నాయకులు శాంతియుత దీక్షకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్రను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. స్వగ్రామం చెర్లోపాలెంలో శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు ఆయనను నిర్బంధించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ జలాశయం ప్రధాన గేట్లు పాడవ్వడం వల్ల నీరు వృథాగా పోతోందన్నారు. దీంతో పంటల సాగుకు ఆకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు కోరినప్పటికీ ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు చెవిన వేసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే శాంతియుత దీక్షకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. ఇటువంటి అక్రమ నిర్బంధాలు ప్రజా సమస్యలపై పోరాటాలను ఆపలేవన్నారు.

వితంతు పింఛన్ కోసం వేడుకుంటూనే ఉంది..!!

- 11 నెలలుగా నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఫలితం లేకపోవడంతో మండల సమావేశం వేదిక వద్దకు వచ్చి కన్నీళ్లు



పింఛను ఇప్పించాలని వేడుకుంటున్న వృద్ధురాలు కన్నయ్యమ్మ

మాకవరపాలెం, ఫిబ్రవరి 10: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎక్కడ సమావేశం ఏర్పాటైనా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చెపుతూనే ఉంటారు. కానీ పలుచోట్ల ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వితంతు పింఛన్ కోసం ఓ వృద్ధురాలు దాదాపు ఏడాదిగా అధికారులు, వైసీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకపోయిందంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. దీనిపై సదరు మహిళ నేరుగా శనివారం మాకవరపాలెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే ఎంపీపీ సత్యనారాయణతో పాటు అక్కడున్న అధికారులకు దరఖాస్తు అంది కన్నీళ్లు పెట్టుకోవడం పలువుర్ని కలచివేసింది. ఇందుకు సంబంధించిన వివరాలివి.

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ శివారు చినరాచపల్లి గ్రామానికి చెందిన చిటికెల కన్నయ్యమ్మ అనే వృద్ధురాలి భర్త వెంకునాయుడు పదకొండు నెలలు క్రితం మృతిచెందాడు. ఇతడు టీడీపీ సానుభూతిపరుడు కావడం వల్లే పింఛన్ పథకం రావడం లేదని స్థానిక టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు వింతంతు పింఛన్ మంజూరు చేయాలని గ్రామంలో ఉన్న అధికార వైసీపీకి చెందిన ఎంపీటీసీ, సర్పంచ్‌ల వద్దకు పలుమార్లు ఆమె వెళ్లింది. దీంతో పింఛను వస్తుందని వారు చెప్పినప్పటికీ ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్ల జాబితాలో తనపేరు లేదని వాపోయింది. దీనిపై గ్రామ సచివాలయం నుంచి ఎంపీడీవో, ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్ వరకు వెళ్లి సమస్యను వివరించి వేడుకుంది. అయినప్పటికీ నేటి వరకు పింఛన్ మంజూరు కాలేదు. గత్యంతరం లేక ఆమె మండల సమావేశం జరుగుతుండగా లోపలికి వచ్చి పింఛన్ మంజూరు చేయాలని ఎంపీపీ వద్ద కన్నీరు పెట్టుకుంది. దీనిపై ఆయన ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మిని ప్రశ్నించగా, కొత్తగా ఈ మధ్యనే దరఖాస్తు చేశామని తెలిపారు.

బ్రాహ్మణ వ్యతిరేకి జగన్

- సాగనంపేందుకు అంతా సిద్ధం కావాలి
- ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ ఆనందసూర్య

చోడవరం, ఫిబ్రవరి 10 : బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించి, బ్రాహ్మణ వ్యతిరేకిగా మారిన ముఖ్యమంత్రి జగన్‌ను సాగనంపేందుకు అంతా సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య పిలుపునిచ్చారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముక్కవిల్లి విస్సు అధ్యక్షతన శనివారం ఇక్కడ జరిగిన బ్రాహ్మణుల సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 2014లో చంద్రబాబు పాలనలో బ్రాహ్మణులకు ప్రత్యేకంగా రూ.500 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కశ్యప, గరుడ, విద్యాభారతి వంటి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. బ్రాహ్మణ పక్షపాతిగా ఉన్న చంద్రబాబును తిరిగి అధికారంలోకి తీసుకు వచ్చేలా బ్రాహ్మణులంతా పనిచేయాలని కోరారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించిన పీఎంకు సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అందుకూరి కిరణ్‌కుమార్, పురుషోత్తమరాజు మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, గూనూరు మల్లునాయుడు, సంఘం నాయకులు వింజమూరి శంకర్, గుం టూరు సత్యనారాయణ, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

లోకేశ్ శంఖారావ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గతంలో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం ఉంటుందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్నివర్గాలకు లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా ప్రజలకు భరోసా ఇచ్చారని తెలిపారు. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో యువనేత పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారని తెలిపారు. శంఖారావం కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరిస్తూ ప్రతీ ఇంటికీ చేరువవుతారన్నారు.

పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



పీవీ నరసింహారావుతో అయ్యన్నపాత్రుడు (ఫైల్)

నర్సీపట్నం, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం దక్కడం తెలుగు వారికి గర్వకారణమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో ఆయనను కలిసినట్టు చెప్పారు. ఆయనతో ఉన్న అనుబంధం మరువలేనిదన్నారు. భారతదేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థిక రంగానికి దిశా నిర్దేశం చేసి ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా అభివృద్ధి చేసిన ఘనుడుగా పేర్కొన్నారు. తొలిసారి మన రాష్ట్రానికి చెందిన పీవీ నరసింహారావుకు భారతరత్న రావడం అందరికీ ఆనందదాయకమన్నారు.

తాను చనిపోతూ మరొకరికి పునర్జన్మ..



గొంతిన రాము (ఫైల్)

లంకెలపాలెం, ఫిబ్రవరి 10: బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన ఓ మహిళ మరొకరికి పునర్జన్మనిచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. లంకెలపాలెంనకు చెందిన గొంతిన రాము (40) వారం రోజుల క్రితం ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు విడిచింది. ఈక్రమంలో జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు అవయవదానం గురించి మృతురాలి భర్త శివకు వివరించారు. దీంతో ఆమె అవయవాలను దానం చేసేందుకు భర్త అంగీకరించారు. ఆమె చనిపోతూ మరొకరి పునర్జన్మ ఇవ్వడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మృతిరాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త శివ కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నారు.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లోకేశ్ శంఖారావం : ప్రగడ



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 10: ప్రభుత్వ అరాచక పాలనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమంతో ప్రభుత్వ పాలనా తీరును ప్రజలకు వివరించనున్నారన్నారు. రానున్న రోజుల్లో నారా లోకేశ్ 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి ఇంటికీ చేరవవుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, నేతలు గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఆడారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ప్రగడ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శనివారం విశాఖ ఎయిర్‌పోర్టులో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శంఖారావంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన లోకేష్‌కు టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

వేద సంపదను భావితరాలకు అందించాలి

» సప్తరుషి వేద పాఠశాల వ్యవస్థాపకులు మాధవశర్మ



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మావూళ్లపల్లి మాధవశర్మ

సబ్బవరం, ఫిబ్రవరి 10: భారతీయ వేద సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గొల్లలపాలెం సప్తరుషి వేద పాఠశాల వ్యవస్థాపకులు మావూళ్లపల్లి మాధవశర్మ అన్నారు. సప్తరుషి వేద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భారత వేద పరిక్రమ యాత్ర విజయోత్సవం శనివారం సప్తరుషి ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశం నలుమూలల ఆదిశంకరాచార్యుల స్ఫూర్తితో సనాతన ధర్మం ఔన్నత్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నేటి యువతకు ఆది శంకరాచార్యులు స్ఫూర్తి కావాలని పిలుపునిచ్చారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



సబ్బవరం, ఫిబ్రవరి 4 : మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలు నుంచి పల్లవానిపాలెం వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. కల్వర్టు పక్కన ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ఎవరైనా పొరపాటుగా ముట్టుకుంటే పెను ప్రమాదం సంభవించే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈపీడీసీఎల్ సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దళితవాడ పంచాయతీలు కావాలి

» ఏఐఎం వ్యవస్థాపకులు సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఏఐఎం వ్యవస్థాపకులు సునీల్‌కుమార్

పాయకరావుపేట, ఫిబ్రవరి 10 : రాష్ట్రంలో వెయ్యి మంది ఉన్న దళితవాడలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి, ఉప ప్రణాళిక నిధులు రూ.2 కోట్లు కేటాయించాలని అంబేద్కర్ మిషన్ ఇండియా వ్యవస్థాపకులు, డీజీపీ పీవీ.సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం పాయకరావుపేటలో ఏఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 19 శాతం ఉన్న దళితుల అభివృద్ధి సాధించాలంటే దళితవాడలు పంచాయతీలు కావాలన్నారు. వెయ్యి జనాభా ఉన్న దళితవాడలను పంచాయతీలుగా మార్చితే రాష్ట్రంలో మూడు వేల పంచాయతీలు ఏర్పడతాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు దళితవాడ పంచాయతీలు చేస్తామని, ఉపప్రణాళిక నిధులు కేటాయిస్తామని తమ మ్యానిఫెస్టోలో పెట్టాలన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్రంలో కులగణన పూర్తయిన వెంటనే దళితవాడ పంచాయతీలు చేసేందుకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అంతకుముందు ర్యాలీగా వచ్చిన పీవీ.సునీల్‌కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జాలాది విజయ, సీఐ విజయ్‌కుమార్, దళిత నాయకులు గారా ప్రసాద్, నెలపర్తి అర్జున్, పల్లా విలియంకేరి, ఇంజరపు సూరిబాబు, ఐఎన్.మూర్తి, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రబీలో కళకళలాడుతున్న పంటలు

» వరి, కూరగాయలు, అపరాలు సాగు

» సాగునీటి వనరుల్లో పుష్కలంగా నీరు



జల్లూరులో వరి నాట్లు వేస్తున్న దృశ్యం



లింగాపురంలో ఏపుగా పెరిగిన బొబ్బర సాగు

కోటవురట్ల, ఫిబ్రవరి 10: మండలంలో పలు గ్రామాల్లో రబీ సీజన్‌లో వేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ వరి కోతలు పూర్తయి, జనవరిలో రబీ సాగుకు రైతులు నాట్లు పూర్తి చేయగా.. మరికొన్ని గ్రామాల్లో ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీవర్షాల కారణంగా 50శాతం పంట నీటమునిగి రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రబీ సీజన్‌కు చెరువుల్లో నీరు ఉండడంతో మండలంలో పలుగ్రామాల్లో రైతులు వరి నాట్లు వేశారు. ప్రస్తుతం కలుపుతీత పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువులు, తాండవ, దుగ్గాడ కాలువ కింద ఉన్న భూముల్లో వరి పంటతోపాటు కూరగాయలు వేయగా, మెట్టప్రాంతాలో రైతులు పెసర, బొబ్బరి పంటలు వేశారు. రబీలో వరి పంట 420 హెక్టార్లులో వేశారు. జల్లూరు, తదితర గ్రామాల్లో ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్నారు. సాగునీటి కొరత ఉన్న యండపల్లి, లింగాపురం, కోటవురట్ల, గవరపేట గ్రామాల్లో రైతులు ఆరుతడి పంటలైన పెసర, జమున, బొబ్బరి, కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పాములవాక, సుంకపూర్, జల్లూరు, తంగేడు, తదితర గ్రామాల్లోని చెరువుల్లో సాగునీరు పుష్కలంగా ఉంది. ఫిబ్రవరి నెలలో కూడా వరహానదిలో, దుగ్గాడ కాలువలో సాగునీరు స్వల్పంగా ప్రవహిస్తున్నది. దీంతో రబీ పంటలకు సాగునీటికి ఎటువంటి ఇబ్బంది రాదని రైతులు భావిస్తున్నారు.

వైభవంగా కశింకోట గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 10 : స్థానిక గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నుంచి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గౌరీపరమేశ్వరులను దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, యువనాయకుడు పీలా శ్రీకాంత్, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు గౌరీపరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి శాశ్వత చందాగా రూ.2లక్షలు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం వీరిని ఉత్సవ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కశింకోట సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్‌కుమార్, పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీను, వేగి దొరబాబు, వేగి వెంకట్రావు, టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

ఐఐటీ తిరుపతి అధికారి హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 : దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని ఐఐటీ తిరుపతి ఇంటర్నేషనల్ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో శనివారం వైబ్రెంట్ డైట్-2024 పేరుతో కళాశాల 18వ వార్షికోత్సవం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిందిఇ. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిదాయక సందేశాన్నిచ్చారు. విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. దీనికి నిలువెత్తు నిదర్శనం డైట్ కళాశాల అని కితాబునిచ్చారు. రత్నాకర్ విజన్ ఉన్న విద్యాసంస్థ ప్రతినిధి అని పేర్కొన్నారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ యువతకు ఏది అసాధ్యం కాదన్నారు. దేనినైనా అసాధ్యమని కొట్టిపారేస్తే తిరిగి దానిని సాధ్యం చేసుకోవడం ఎలా అని ఆలోచించలేమన్నారు. 18 ఏళ్ల ఈ కళాశాల ప్రయాణంలో తనవెన్నంటే నిలిచి కళాశాల అభివృద్ధికి సహకరించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర, సిబ్బందిని కొనియాడారు. ఈ ఏడాది కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, పాటలు, నృత్య, టెక్నికల్ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా క్యాష్ ప్రైజ్, బహుమతులు అందజేశారు. క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు సాధించిన, అధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకాడమిక్ డాక్టర్ పార్వతి, అసోసియేట్ డీన్ అకడమిక్ కృష్ణనాగు, డీన్ అడ్మిన్ కేఎస్ ఈశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. తదనంతరం గాయని సాహితీ చాగంటి ఆలపించిన గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ప్రతీ నిర్వాసితుడికి ప్యాకేజి ఇవ్వాలి

» నాయకులు, నిర్వాసితుల డిమాండ్



సమస్యలు పరిష్కారించాలని కోరుతున్న నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 10: వైజాగ్- చైన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో సేకరిస్తున్న ప్రతీ సెంటు భూమికి పరిహారం, ప్రతీ నిర్వాసితుడికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని నిర్వాసితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో సమావేశమైన నిర్వాసితులు మాట్లాడుతూ.. ఇల్లు కోల్పోయిన వారికి రూ.25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఇల్లు కోల్పోతున్నవారికి అనువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇక్కడ బల్క్ డ్రగ్స్ కంపెనీలు నెలకొల్పవద్దని, చందనాడలో గల దళితుల ముగ్గు గుల్ల బట్టీల్లో డీఫారం భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మత్స్యకారుల ఉపాధికి ఫిషింగ్ జెట్టి నిర్మించాలని కోరారు. సాగు భూములకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించిన తర్వాతే ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పడానికి పూనుకోవాలని కోరారు. అప్పటి వరకు ఏ విధమైన నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బుచ్చిరాజుపేట అమలాపురం, గ్రామ సర్పంచులు కాళ్ల శ్రీనివాసరావు, పెదపూడి శంకరర్రావు, రాజయ్యపేట ఉపసర్పంచ్ కొండలరావు,తదితరు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ఆర్థిక సాయం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ కార్పొరేషన్‌ల ద్వారా బీసీలకు ఆర్థిక సాయం అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు....... సిరసపల్లిలో శనివారం జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు టీడీపీ ప్రభుత్వం పుట్టినిల్లులాంటిదని, అధికారంలోకి రాగానే ఆదరణ పథకం పునరుద్ధరిస్తామన్నారు. బీసీలకు డిక్లరేషన్ ఇచ్చిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం బీసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, టీడీపీ నాయకులు నీలబాబు, కశిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

» సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, ఫిబ్రవరి 10 : రక్తదానం ప్రాణదానంతో సమానమని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్థానిక దీపాంజలి నగర్‌లోని జీవన్‌రేఖ హాస్పటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీజీఎం మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన పలువురు ఉద్యోగులు, ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు, సీఐఎస్ఎఫ్ఐ ఉద్యోగులు శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పలువురు రక్తదాతలకు సింహాద్రి జీజీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీ చైర్మన్ వైఎస్ఎస్ రెడ్డి, సీఎంవో కె.విజయ, దీపికా లేడిస్‌క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా పాల్గొన్నారు.

వైసీపీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్

... 3వ పేజీ తరువాయి

ఇవ్వలేదు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్థానంలో అవకాశం ఇస్తారని అనుకున్నా..ఆ సూచనలు ఏమీ కనిపించడం లేదు. అనకాపల్లి ఎంపీగా పోటీకి దింపినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని ఆయన అనుచరులు అంటున్నారు. జగన్ ఏమి చెబితే అది చేస్తానని అమర్‌నాథ్ అంటున్నారు. ఎన్నికల బరిలో ఉంటారా?, లేక పార్టీ సేవలకే పరిమితమవుతారా?...అనేది త్వరలో తేలిపోనుంది.

హనుమాన్ విజయంలో మనోళ్లు

... 3వ పేజీ తరువాయి

వివిధ రంగాలకు సంబంధించిన యాడ్స్ రూపొందించే వారు. హిందీ, డిస్నీ హాట్‌స్టార్‌లో వచ్చే యానిమేషన్ సీరియళ్లు, పలు తెలుగు, హిందీ సినిమాలకు సైతం వీఎఫ్ఎక్స్ పనులు చేసేవారు. హనుమాన్‌లో తక్కువ బడ్జెట్‌లోనే ఉదయ్‌కృష్ణ రూపొందించిన వీ ఎఫ్ఎక్స్ వర్క్ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఈ సినిమాలో చూపించిన పర్వతాలు చాలా వరకు పాడేరు మండలంలోని వంట్లమామిడి, వంజపర్తి తదితర ప్రాంతాల్లో తీసినవి. ఇక ఈ సినిమా క్లైమాక్స్‌లో కొన్ని సీన్లు చీడికాడ మండలం కోనాంలో చిత్రీకరించారు. ఈ సినిమాలో బ్యాక్‌గ్రౌండ్‌గా ఉపయోగించిన కొండలన్నీ పాడేరు మండలంలోని వంజపర్తి, మోదాపల్లి, డల్లాపల్లి ప్రాంతాల్లోనివి కావడం విశేషం. ఈ కొండల ఫొటోలను పట్టణంలోని ఎడ్లవీధికి చెందిన ఫొటోగ్రాఫర్ సత్యనారాయణమూర్తి తీశారు.

ఎంతో ఆనందంగా ఉంది

- కోరుకొండ సత్యనారాయణ మూర్తి



హనుమాన్ సినిమా వీఎఫ్ఎక్స్ సృష్టికర్త ఉదయ్ కృష్ణ నాకు బాల్య స్నేహితుడు. హనుమాన్ సినిమాకు సంబంధించి పాడేరు పరిసర ప్రాంతాల్లోని ఎత్తైన పర్వతాలను గుర్తించి వాటిని ఫొటోలు తీశాం. అలాగే ఏజెన్సీ అందాలు కూడా ఫొటోలు తీశాం. సినిమా బ్యాక్‌గ్రౌండ్‌లో వాడిన కొండలు పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ వంజపర్తి పరిసర ప్రాంతాల్లోనివి. సినిమాలో అల్లూరి జిల్లా ప్రాంత పర్వతాలు, అనకాపల్లి ప్రాంతాలైన కోనాం తదితర ప్రదేశాలు చిత్రీకరించడం ఆనందం కలిగించింది.

ఓ పట్టాన రిజిస్ట్రేషన్ కావట్లే!

... 3వ పేజీ తరువాయి

మొరాయిస్తుండడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అనకాపల్లి మండలంలో ఊడేరు, బవులువాడ, వెంకుపాలెం, పరిసరాల్లో సచివాలయాల్లో 480 కి పైగా ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉండగా, సర్వర్ మొరాయించడంతో ఇప్పటి వరకు కేవలం 120 మాత్రమే జరిగాయి. కొన్ని సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం ఐదులోపే రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి సర్వర్ కాస్త వేగంగా పనిచేస్తుండడంతో లబ్ధిదారులు రాత్రి 8 గంటల వరకు పడిగాపులు కాస్తున్నారు. అనకాపల్లి మండలంలోనే కాక నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, మాడుగుల మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందని సమాచారం. జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు.. అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా 54 వేల మందికి గతంలో ఇళ్ల పట్టాలు అందజేయగా, సాంకేతిక సమస్య కారణంగా ఇప్పటి వరకు జిల్లాలో 20 శాతం పట్టాలు కూడా రిజిస్ట్రేషన్ కాలేదని తెలిసింది. ఇన్నాళ్లు రిజిస్ట్రేషన్ల ఊసెత్తని ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండంతో హడావిడి చేస్తున్నప్పటికీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై గృహ నిర్మాణ సంస్థ పీడీ రమామణిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖాధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నదన్నారు. కొన్నిచోట్ల సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు.

ఓపీఎస్ కావాలంటూ యూటీఎఫ్ ఆందోళన



కొత్తపేటలో ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ సంఘం నేతలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 10: పట్టణంలోని కొత్తపేట, తులసీనగర్ హైస్కూళ్లలో పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమాన్ని యూటీఎఫ్ ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించారు. పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తులసీనగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ సంఘం నేతలు, ఉపాధ్యాయులు పాత పింఛన్‌ను కొనసాగించాలని నినాదాలు చేశారు.

రథసప్తమికి ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన రథసప్తమి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ కేఎం నాయుడు తెలిపారు. భక్తుల కోసం క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 16వ తేదీన తెల్లవారుజామున సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వైద్య విభాగ ప్రధానకార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ కౌన్సిలర్ దాడి నారాయణరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా తాత మామ్మ తీర్థం

పరవాడ, ఫిబ్రవరి 10: మండలంలోని నాయుడుపాలెంలో తాత మామ్మ తీర్థం శనివారం వైభవంగా జరిగింది. తాత మామ విగ్రహాలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాముగరిడిలు, కోలాటం, చిటికెల భజనలు అలరించాయి. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మూడు గ్రామాల్లో 'పల్లెకు పోదాం'

రాంబిల్లి, ఫిబ్రవరి 10: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు శనివారం మండలంలోని కొత్తపేట, చినకలవలాపల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు ధర్మాల వరహా గోవింద రెడ్డి, మండల అధ్యక్షులు కారే రాముడు, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షులు నాగమంత్రి శ్రీనివాసరావు కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ మౌలిక వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను బీజేపీ నేతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫ్యాన్లు వితరణ



బాలికాసదన్‌కు టేబుల్ ఫ్యాన్లు ఇస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10: స్థానిక చిన్నవీధి రామాలయం వద్ద పేదలకు భోజన ప్యాకెట్లు, పేదలకు వస్త్రాలను గ్రంధి కుటుంబీకులు శనివారం అందజేశారు. అలాగే కశింకోట బాలికాసదన్‌లో పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు, పుస్తకాలతోపాటు రెండు టేబుల్ ఫ్యాన్‌లను బహూకరించామని గ్రంధి లక్ష్మణకుమార్ తెలిపారు. పెందుర్తిలోని మానసిక ఆశ్రమానికి వంట పాత్రలు, అచ్యుతాపురం దివ్యాంగుల ఆశ్రమంలో భోజనాలకు అవసరమైన కిరాణ సామగ్రి అందజేశామన్నారు. తన తల్లి గ్రంధి లక్ష్మీ జ్ఞాపకార్థం వీటిని బహూకరించామని తెలిపారు.

ఘనంగా శ్యామా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో కొలువైన శ్యామలా అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 10: మండలంలోనే దేవీపురం యంత్ర మహామేరునందు మాఘ శుద్ధ పాడ్యమి సందర్భంగా శనివారం శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ గోమాతకు పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి బ్రహ్మ పీఠంపై అధిష్ఠంపజేసి పవిత్ర జలాలతో అమ్మవారికి క్షీర, పంచామృత ద్రవ్యాలతో అభిషేకం చేసి నూతన వస్త్రాభరణాలతో అలంకరించారు. సాయం త్రం లఘు శ్యామహవనం నిర్వహించారు. కార్యక్రమంలో డల్లాస్ నుంచి వచ్చిన రిటైర్డ్ ఐపీఎస్ వెంకటరమణ, శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, కందర్ప రమా, భక్తులు పాల్గొన్నారు.

గణపర్తి హైస్కూల్‌లో డైనింగ్ హాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

మునగపాక, ఫిబ్రవరి 10 : మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన డైనింగ్ హాలును ఎమ్మెల్యే కన్నబాబు శనివారం ప్రారంభించారు. వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజరు సంజయ్‌కుమార్ సిన్హా, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పి. స్వామి సత్యనారాయణ, ఎన్టీపీసీ డీజీఎంలు అనిత్‌కుమార్, సంతిల్‌కుమార్, కాండ్రేగుల విష్ణుమూర్తి, సర్పంచ్ నాయుడు పాల్గొన్నారు.

'సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి'

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10: సనాతన ధర్మాన్ని హిందువులంతా కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. శనివారం గొర్లె ధర్మవరం రామాలయంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మణరావు, జి.సత్తిబాబు, జి.అర్జున, సంజీవి, పి.గణేష్, జి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10: మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా శనివారం వెదురువాడలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ నారాయణరావు ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంటులో జిల్లా నలుమూలల నుంచి 15 జట్లు పాల్గొంటున్నాయి. విజేతలకు నగదు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, మహాలక్ష్మి, సీరా శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యను ప్రస్తావించిన సర్పంచ్..
పక్క గ్రామాల గురించి మాట్లాడొద్దన్న ఎంపీపీ

- మాకవరపాలెం మండల సమావేశంలో ఇరువురి మధ్య వాగ్వాదం
- పంట నష్టపరిహారం ఎప్పుడు వస్తుందో చెప్పాలని టీడీపీకి చెందిన శెట్టిపాలెం సర్పంచ్ డిమాండ్
- తహసీల్దార్, ఎంపీడీవో లేకపోవడంతో మొక్కుబడిగా ముగింపు


రైతు సమస్యపై ఎంపీపీని ప్రశ్నిస్తున్న శెట్టిపాలెం సర్పంచ్ రామునాయుడు

మాకవరపాలెం, ఫిబ్రవరి 10 : రైతుల సమస్యను ఓ సర్పంచ్ ప్రస్తావించగా.., పక్క గ్రామాల సమస్యలపై మీరు మాట్లాడరాదంటూ స్వయానా మండలాధ్యక్షుడే మాటలతో ఎదురుదాడి చేయడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు ఇరువురి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇందుకు మాకవరపాలెం మండల సర్వసభ్య సమావేశం వేదికైంది. ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం ఈ సమావేశం ఏర్పాటైంది. తొలుత ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ ఈ- క్రాప్ ఉంటేనే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రాయితీలు వస్తాయని చెపుతుండగా టీడీపీకి చెందిన శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు అడ్డు తగిలారు. తుఫాన్ కారణంగా మండలంలో అధిక సంఖ్యలో రైతులు పంటలు నష్టపోయారని వివరించారు. వారందరికీ నష్టపరిహారం ఎప్పుడు వస్తుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ కలుగజేసుకుని మీ గ్రామ సమస్యలు మీద మాట్లాడాలని, అంతే గాని పక్క గ్రామల సమస్యలపై మాట్లాడకూడదని అనడంతో పలువురు సభ్యులు నివ్వెరపోయారు. తుఫాన్ కారణంగా నష్టం మండల వ్యాప్తంగా జరిగిందని, ఇది రైతులందరి సమస్య అయినప్పుడు సమావేశంలో ప్రస్తావించడం తప్పు ఎలా అవుతుందని పలువురు సభ్యులు చర్చించుకోవడం కనిపించింది. వ్యవసాయాధికారి కలుగజేసుకొని మండలంలో 1350 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగిందన్నారు. ఈ జాబితాను ఇప్పటికే ప్రభుత్వనికి నివేదించినట్టు చెప్పారు. అలాగే వైఎస్సార్ మార్ట్‌ల ద్వారా డ్వాక్రా సభ్యులకు ఎటువంటి లాభం లేదని, మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయాలని సభ్యులపై తీవ్ర ఒత్తిడి ఉందని టీడీపీ పలువురు సభ్యులు ఆరోపించారు. బూరుగుపాలెంలో గత నాలుగేళ్లుగా పశువైద్యాధికారి లేక పాడి పశువులకు సరైన వైద్యం అందడం లేదని ఆ గ్రామ సర్పంచ్ రమణ అన్నారు. అనంతరం మిగిలిన అధికారులు వారివారి శాఖల పనితీరును తెలియజేశారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు రాజారావు, రుత్తల లక్ష్మిలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండల సమావేశం మొక్కుబడిగా సాగిందని చెప్పవచ్చు. ప్రధానంగా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ఎంపీడీవో, తహసీల్దార్ సమావేశంలో లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

'వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలి'


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సూరిబాబు

దేవరాపల్లి, ఫిబ్రవరి 10 : వీఓఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో శనివారం జి.రాము అధ్యక్షతన ఏర్పాటైన వీఓఏల సమావేశంలో మాట్లాడారు. సంఘం ప్రతినిధులు స్రుజన, డి.వెంకన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్

... 3వ పేజీ తరువాయి

ఇవ్వలేదు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్థానంలో అవకాశం ఇస్తారని అనుకున్నా...ఆ సూచనలు ఏమీ కనిపించడం లేదు. అనకాపల్లి ఎంపీగా పోటీకి దింపినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని ఆయన అనుచరులు అంటున్నారు. జగన్ ఏమి చెబితే అది చేస్తానని అమర్‌నాథ్ అంటున్నారు. ఎన్నికల బరిలో ఉంటారా?, లేక పార్టీ సేవలకే పరిమితమవుతారా?...అనేది త్వరలో తేలిపోనుంది.

ఓ పట్టాన రిజిస్ట్రేషన్ కావట్లే!

... 3వ పేజీ తరువాయి

మొరాయిస్తుండడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

లబ్ధిదారుల పడిగాపులు

అనకాపల్లి మండలంలో ఊడేరు, బవులువాడ, వెంకుపాలెం, పరిసరాల్లో సచివాలయాల్లో 480 కి పైగా ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉండగా, సర్వర్ మొరాయించడంతో ఇప్పటి వరకు కేవలం 120 మాత్రమే జరిగాయి. కొన్ని సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం ఐదులోపే రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి సర్వర్ కాస్త వేగంగా పనిచేస్తుండడంతో లబ్ధిదారులు రాత్రి 8 గంటల వరకు పడిగాపులు కాస్తున్నారు. అనకాపల్లి మండలంలోనే కాకనాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, మాడుగుల మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందని సమాచారం. జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు.. అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా 54 వేల మందికి గతంలో ఇళ్ల పట్టాలు అందజేయగా, సాంకేతిక సమస్య కారణంగా ఇప్పటి వరకు జిల్లాలో 20 శాతం పట్టాలు కూడా రిజిస్ట్రేషన్ కాలేదని తెలిసింది. ఇన్నాళ్లు రిజిస్ట్రేషన్ల ఊసెత్తని ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండంతో హడావిడి చేస్తున్నప్పటికీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై గృహ నిర్మాణ సంస్థ పీడీ రమామణిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖాధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నదన్నారు. కొన్నిచోట్ల సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన జగన్

- చంద్రబాబు వంటి సమర్థుడు వస్తేనే భవిష్యత్తు
- ఎన్నికల్లో ప్రజలంతా వైసీపీకి బుద్ధి చెప్పాలి
- టీడీపీ నాయకులు పిలుపు


మహిళలతో కలిసి పాదయాత్ర చేస్తున్న రామానాయుడు, పీవీజీ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు


తూటిపాల లో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

చీడికాడ, ఫిబ్రవరి 10 : వైసీపీ పాలనలో అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అప్పల రాజుపురం, బి.సింగవరం, ఎల్‌బీపట్నం, ఖండివరం, వీరభద్రునిపేట, శిరిజాం, కోనాం, మంచాల గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ పాలనలో గత ఐదేళ్లలో సుమారు రూ.12లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. అభివృద్ధికన్నా అవినీతికి జగన్ పెద్దపీట వేశారని ఆరోపించారు. తెలుగుదేశం- జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారన్నారు. టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలంతా రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిందిగా వారు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, బొబ్బాది తాతారావు, గవిరెడ్డి జగన్నాథం, గవిరెడ్డి శ్రీనివాసరావు, శరగడం శివ, బండారు శేషగిరిరావు, కురచా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వైసీపీ నేతలు సాగిస్తున్న దారుణాలకు గట్టిగా సమాధానం చెప్పేలా.. అన్ని వర్గాలకు అండగా నిలిచేలా.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమం చేపడుతున్నట్టు ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా లోకేశ్ శంఖారావం పేరిట ఆదివారం నుంచి ఉత్తరాంధ్ర పర్యటన ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, నాయకులు సయ్యపురెడ్డి మాధవరావు, అక్కిరెడ్డి కనకరాజు పాల్గొన్నారు.

మాకవరపాలెం : వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. ఆంధ్ర ప్రజల కష్టాలు తొలగిపోవాలన్నా, రాష్ట్రం ప్రగతి పథాన పయనించాలన్నా టీడీపీ- జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. మండలంలోని తూటిపాల గ్రామంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. తూటిపాల గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనకబడి ఉందన్నారు. ఈ గ్రామంలో మురుగు నీరు రోడ్లపై పారుతోందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. దీంతో ప్రజలంతా వైసీపీ పాలనపై విసుగు చెందారన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, నాయకులు గవిరెడ్డి నూకరాజు, రామారావు, అల్లు రామునాయుడు, గోవింద, శీరంరెడ్డి రమణ, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం


నిమజ్జనోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట, ఫిబ్రవరి 10 : మండల కేంద్రం రోలుగుంటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఆది దంపతులకు విశేష పూజలు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. పరిసర మండలాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో కోలాహల వాతావరణం కనిపించింది. చివరిరోజు ఉదయం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా తీసుకు వెళ్లి కోనేరులో నిమజ్జం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చోడవరం ఎంపిక'


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 10 : జిల్లాలో నిరంతరాయంగా వ్యవసాయ, గృహావసరాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు మోడల్ నియోజకవర్గంగా చోడవరం ఎంపికైందని విప్ ధర్మశ్రీ తెలిపారు. శనివారం ఈపీడీసీఎల్ డీఈలు, ఏఈలతో ఇక్కడి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రూ.50 కోట్లతో నియోజకవర్గంలోని గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ విద్యుత్, గృహావసరాలకు వేర్వేరుగా విద్యుత్ లైన్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. చోడవరంలో విద్యుత్ అంతరాయాన్ని సరిదిద్దేందుకు పట్టణ శివారు నరసయ్యపేటలో సబ్‌స్టేషన్ ఏర్పాటు కానున్నట్టు చెప్పారు. నరసయ్యపేటలో, రోలుగుంట మండలం కొంతలం, బుచ్చెయ్యపేట మండలం జేపీ అగ్రహారంలలో మూడుసబ్‌స్టేషన్లు ఏర్పాటు కానున్నాయన్నారు. త్వరలోనే చోడవరంలో ఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకానుందన్నారు. ఈ సమావేశంలో ఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ రామకృష్ణ, చోడవరం, వడ్డాది ఏడీఈలు ఉమాగౌరీ శంకర్, అప్పలనాయుడు, నాలుగు మండలాల ఏఈలు విద్యుత్ సిబ్బంది, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక, తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేరు గెడ్డలో ఇసుక తవ్వకాల నియంత్రణకు చర్యలు

మార్గ మధ్యలో జేసీబీతో గుంతలు తీయిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు


గెడ్డకు వెళ్ల దారిలో జేసీబీతో గుంతలు తవ్వుతున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 10 : లింగంపేటలోని నూకాలమ్మ ఆలయ సమీపంలో గల బొడ్డేరు గెడ్డలో ఇసుక తవ్వకాలు జరగకుండా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జేసీబీతో రోడ్డుకు అడ్డంగా గుంతలను తవ్వించారు. ఈ గెడ్డలో నిర్మించిన భారీ తాగునీటి పథకం వద్ద ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపుతూ తోలుకుపోతున్నారు. దీంతో త్వరలో వేసవి ఆరంభం కావడంతో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ గుంతలు తవ్వుతున్నట్టు మండల నీటిపారుదల శాఖాధికారిణి సుధీషణ తెలిపారు. ఇసుకను తవ్వుతుండడం వల్ల ప్రాజెక్టు ప్రాంతంలో నీటి నిల్వలు అడుగంటే ప్రమాదం ఉందని ఆమె వివరించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం


ఆర్‌బీకే భవనం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు, ఫిబ్రవరి 10 : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను శనివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ భవనాన్ని, వారాడ, ఆర్‌వై అగ్రహారం, కె.సంతపాలెం, కింతాడ, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాల్లో సచివాలయాలు , రైతు భరోసా కేంద్రాల భవనాలు, రామచంద్రపురం నుంచి లంకవానిపాలెం, గొండుపాలెం నుంచి మురుగుపాలెం బీటీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ ఈర్లె అనూరాధ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

డ్వాకా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ

రావికమతం, ఫిబ్రవరి 10 : రోలుగుంట, రావికమతం, మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు శనివారం కొత్తకోటలో నాలుగో విడత ఆసరా చెక్కులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీలు పైల రాజు,యర్రం శెట్టి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, జడ్పీటీసీ తలారి రమణమ్మ, కంచిపాటి జగన్నాథరావు, సత్యదేవా,"సర్పంచ్ కోనలోవ రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో బీజేపీ నాయకులు పర్యటన

కె.కోటపాడు, ఫిబ్రవరి 10 : దాలివలస, సింగన్నదొరపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో బీజేపీ నాయకులు శనివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొట్టానా ఈశ్వరరావు వివరించారు. నాయకులు ఎస్.శివ, ఇ.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : పోతనపూడి, ముకుందపురం గ్రామాల్లో శనివారం బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి దర్శిశెట్టి నారాయణరావు ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలుతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రజలకు అందించిన సేవలను వివరించారు. అనంతరం క్యాలెండర్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

గొలుగొండ, ఫిబ్రవరి 10 : ఇక్కడి అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ శనివారం తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో చెరొక 40 సీట్లు ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు. పూర్తి వివరాలకు గొలుగొండలో గల కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు.

వినాయక ఆలయంలో హుండీ చోరీ

మాడుగుల, ఫిబ్రవరి 10 : ఇక్కడి వినాయక ఆలయంలో హుండీని దొంగిలించారు. శుక్రవారం అర్ధరాత్రి తరువాత మాడుగుల కేంద్రం జగ్గన్నచావడి వద్ద గల లక్ష్మీ విఘ్నవినాయక ఆలయ గేట్లకు వేసిన తాళాలు విరగ్గొట్టి ఆలయంలో గల హుండీని ఎత్తుకెళ్లి పోయారు. ఏడాదిగా హుండీ ఆదాయాన్ని లెక్కించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ దామోదరనాయుడు పరిశీలించారు.

వైసీపీ ప్రభుత్వానికి యువత ఓటుతోనే సమాధానం

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

దేవరాపల్లి, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేమల కన్నబాబు అన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపు నిచ్చిన నేపథ్యంలో ఆయన అక్కడికి వెళ్లకుండా పోలీసులు ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ఈ వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వారే ఈ పార్టీకి బుద్ధి చెపుతారన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్న సత్యాన్ని ప్రభుత్వం, పోలీసులు గుర్తించాలన్నారు.

బీబీ పట్నంలో పూరి పాక దగ్ధం

రోలుగుంట, ఫిబ్రవరి 10 : బీబీ పట్నం గ్రామ శివారులో ఉంటున్న పూరిపాక దగ్ధమైంది. రోడ్డుకు ఆను కుని తాడి లక్ష్మి అనే మహిళ పశువుల పాక నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటోంది. గెదెలతో పాటు, గొర్రెలు, కోళ్లను ఎంచుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పక్కనే ఉన్న గడ్డిమేటలో గడ్డి తీసి నిప్పు అంటించి పాకకు కూడా నిప్పు పెట్టినట్టు ఆమె ఆరోపించింది. మంటలు చెలరేగడంతో ఇది చూసినవారు పశువులను, గొర్రెలను బయటకు తోలారు. వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు కాలి బూడిద కావడంతో ఆమె విలపిస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా వేడుకుంటోంది.

రామాలయం అభివృద్ధికి భూమి పూజ

రావికమతం, ఫిబ్రవరి 10 : కొత్తకోటలో గట్రెడ్డివారి రామ మందిరం పునర్నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆలయ పునర్నిర్మాణానికి 50మందితో పలు కుటుంబాల యువకులు కమిటీగా ఏర్పడి విరాళాలు సేకరిస్తున్నారు. ఆలయంతో పాటు కల్యాణ మండపం ఉండేలా నిర్మించాలని సంకల్పించారు.

వికాస పొదుపు సంఘం రజతోత్సవం


వేడుకల్లో పాల్గొన్న సంఘం చైర్మన్, డైరక్టర్లు, సిబ్బంది

చోడవరం, ఫిబ్రవరి 10 : పట్టణంలో వికాస పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం రజతోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న కార్యక్రమాలను సంఘం ఎండీ కోన సరోజ వివరించారు. సభ్యుల సహకారంతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకుని వెళతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్య మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పిల్లల పండగ

నర్సీపట్నం, ఫిబ్రవరి 10 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిల్లల పండగను శనివారం ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో శాస్త్రీయ నృత్యం, కథ విశ్లేషణ, కవితలు, ఏకపాత్రాభినయం, దేశభక్తి గేయాలు, జానపద నృత్య ప్రదర్శనలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ అధికారి గోపాలరావు చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజేపురంలో పశు వైద్య శిబిరం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 10 : మండలంలోని కేజేపురంలో శనివారం మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం, రైతు సదస్సు నిర్వహించారు. పాడి రైతులకు పశుగ్రాస పెంపకం, కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలుపై అవగాహన కల్పించారు. పశువులకు చికిత్సలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణ, పశు వైద్యులు మణి లక్ష్మణ్ , గణేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిండుగొండ జంక్షన్‌లో శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్


శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్

రోలుగుంట, ఫిబ్రవరి 10 : నిండుగొండ జంక్షన్‌లో బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. గచ్చులు, గోడలు అస్తవ్యస్తంగా మారాయి. శ్లాబ్‌నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో అందులోకి వెళ్లాలంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. దీంతో గత కొన్నాళ్లుగా ఇది నిరుపయోగంగా పడిఉంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల కోసం ఎండలో లేదా దుకాణాల నీడన వేచి ఉండాల్సి వస్తుంది. ఇటుగా రాకపోకలు సాగించే అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ బస్ షెల్టర్ దుస్థితిని చూసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్తగా షెల్టర్‌ను నిర్మించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు

- రాములవారి తీర్థం సందర్భంగా విజయరామరాజుపేటలో నిర్వహణ
- ఆకట్టుకున్న ముగ్గుల పోటీ


పోటీలో పరుగుతీస్తున్న ఎడ్ల బండి


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 10 : విజయరామరాజుపేటలో శనివారం సీతారాముల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. మొత్తం పదహారు జతల ఎడ్లు తలపడ్డాయి. అలాగే మండలస్థాయి ముగ్గుల పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. జడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ వై.విజయకుమార్, ఎంపీటీసీ బాలకృష్ణ, సంస్థ కార్యదరిర్శ ఆరిపాక కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ దొడ్డి కిశోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయంలో మనోళ్లు

... 3వ పేజీ తరువాయి

వివిధ రంగాలకు సంబంధించిన యాడ్స్ రూపొందించేవారు. హిందీ, డిస్నీ హాట్‌స్టార్‌లో వచ్చే యానిమేషన్ సీరియళ్లు, పలు తెలుగు, హిందీ సినిమాలకు సైతం వీఎఫ్ఎక్స్ పనులు చేసేవారు. హనుమాన్‌లో తక్కువ బడ్జెట్‌లోనే ఉదయ్‌కృష్ణ రూపొందించిన వీ ఎఫ్ఎక్స్ వర్క్ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఈ సినిమాలో చూపించిన పర్వతాలు చాలా వరకు పాడేరు మండలంలోని వంట్లమామిడి, వంజపర్తి తదితర ప్రాంతాల్లో తీసినవి. ఇక ఈ సినిమా క్లైమాక్స్‌లో కొన్ని సీన్లు చీడికాడ మండలం కోనాంలో చిత్రీకరించారు. ఈ సినిమాలో బ్యాక్‌గ్రౌండ్‌గా ఉపయోగించిన కొండలన్నీ పాడేరు మండలంలోని వంజపర్తి, మోదాపల్లి, డల్లాపల్లి ప్రాంతాల్లోనివి కావడం విశేషం. ఈ కొండల ఫొటోలను పట్టణంలోని ఎడ్లవీధికి చెందిన ఫొటోగ్రాఫర్ సత్యనారాయణమూర్తి తీశారు.

ఎంతో ఆనందంగా ఉంది



హనుమాన్ సినిమా వీఎఫ్ఎక్స్ సృష్టికర్త ఉదయ్‌కృష్ణ నాకు బాల్య స్నేహితుడు. హనుమాన్ సినిమాకు సంబంధించి పాడేరు పరిసర ప్రాంతాల్లోని ఎత్తైన పర్వతాలను గుర్తించి వాటిని ఫొటోలు తీశాం. అలాగే ఏజెన్సీ అందాలు కూడా ఫొటోలు తీశాం. సినిమా బ్యాక్‌గ్రౌండ్‌లో వాడిన కొండలు పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ వంజపర్తి పరిసర ప్రాంతాల్లోనివి. సినిమాలో అల్లూరి జిల్లా ప్రాంత పర్వతాలు, అనకాపల్లి ప్రాంతాలైన కోనాం తదితర ప్రదేశాలు చిత్రీకరించడం ఆనందం కలిగించింది.

- కోరుకొండ సత్యనారాయణ మూర్తి, చోడవరం